## విలేకరులు కావలెను

**మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

**Cell: 9247819181**
**8309605189**



# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 229 | volume::1, Issue:229 | బుధవారం 18 మార్చి 2026 | పేజీలు : 8 | వెల : 3.00


## పార్లమెంట్ గౌరవం కాపాడాలి




**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి హృదయంగా భావించబడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రజల తరఫున ఎన్నుకోబడిన ప్రతినిధులు దేశానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించే వేదికగా పార్లమెంట్ పనిచేస్తుందని ఆయన అన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు పంపిన లేఖలో పార్లమెంట్ చర్చల ప్రాముఖ్యతను ప్రధాని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అభిప్రాయ భేదాలు సహజమని, కానీ అవి పార్లమెంట్ నియమ నిబంధనలు మరియు మర్యాదల పరిధిలోనే వ్యక్తం కావాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వివిధ రాజకీయ పార్టీలకు వేర్వేరు అభిప్రాయాలు ఉండటం సహజమని ప్రధాని తెలిపారు. ప్రజల సమస్యలు, విధానాలపై సభ్యులు తమ అభిప్రాయాలను గట్టిగా వ్యక్తపరచడం కూడా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని ఆయన పేర్కొన్నారు. అయితే ఆ అభిప్రాయాలను వ్యక్తపరచే విధానం పార్లమెంట్ గౌరవాన్ని దెబ్బతీయకుండా ఉండాలని ఆయన అన్నారు. క్రమశిక్షణ, నియమాలు, పరస్పర గౌరవం పాటించడం ద్వారా మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ వ్యవస్థ దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని అన్నారు. ప్రజల తరఫున ఎన్నుకోబడిన ప్రతినిధులు చర్చలు, నిర్ణయాల ద్వారా దేశ భవిష్యత్తును నిర్మించే బాధ్యత వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అందువల్ల పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు ప్రతి సభ్యుడు నియమాలు పాటిస్తూ, దేశ ప్రయోజనాలను ముందుంచి వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు రాష్ట్రపతి అభినందనలు




**న్యూఢిల్లీ:** అక్షయ పాత్ర ఫౌండేషన్ అందించిన ఐదు బిలియన్ భోజనాల మైలురాయిని పురస్కరించుకుని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అక్షయ పాత్ర ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. పిల్లలకు పోషకాహారం అందించడం ద్వారా దేశ భవిష్యత్తు నిర్మాణానికి ఈ సంస్థ విశేషంగా దోహదపడుతోందని పేర్కొన్నారు. పిల్లలకు సురక్షితమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తును అందించడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని రాష్ట్రపతి పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ బాధ్యతను పంచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పిల్లలే దేశ భవిష్యత్తును నిర్మించే శిల్పులని, వారికి సరైన పోషకాహారం అందించడం అత్యంత ముఖ్యమని ఆమె అన్నారు. ప్రస్తుతం పిల్లలకు అందుతున్న పోషకాహారం భవిష్యత్తులో దేశానికి అమూల్యమైన మానవ వనరుగా మారుతుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ పెట్టుబడి దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కీలకంగా మారుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని కూడా ఆమె సూచించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ దేశవ్యాప్తంగా పాఠశాల పిల్లలకు ఉచిత భోజనం అందిస్తూ కీలక సేవలను అందిస్తోంది. పాఠశాల విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం, చదువుపై ఆసక్తిని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఐదు బిలియన్ భోజనాల మైలురాయిని చేరుకోవడం ఒక ముఖ్యమైన ఘట్టమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.

## దత్తత తీసుకున్న మహిళలకు ప్రసూతి సెలవులు



**న్యూఢిల్లీ:** చిన్నారులను దత్తత తీసుకునే మహిళలకు ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. దత్తత తీసుకున్న బిడ్డ వయసు మూడు నెలల కంటే తక్కువగా ఉండాలి అనే నిబంధన సరైనది కాదని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ నిబంధనకు అనుమతించే సామాజిక భద్రత నియమావళి-2020లోని ఒక నిబంధన రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. దత్తత తీసుకున్న చిన్నారి వయసుతో సంబంధం లేకుండా మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దత్తత తీసుకున్న తేదీ నుంచి 12 వారాల పాటు ప్రసూతి సెలవులు తీసుకునే హక్కు మహిళలకు ఉంటుందని న్యాయస్థానం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా దత్తత తీసుకునే మహిళల హక్కులకు రక్షణ లభిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధన ప్రకారం మూడు నెలల లోపు వయస్సు ఉన్న శిశువును దత్తత తీసుకున్న మహిళలకు మాత్రమే ప్రసూతి సెలవులు ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే ఇది సమానత్వ సూత్రాలకు విరుద్ధమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దత్తత తీసుకున్న చిన్నారి సంరక్షణకు తల్లి సమయం అవసరమని, అందుకే వయసుతో సంబంధం లేకుండా ఈ సౌకర్యం ఇవ్వాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో దత్తత తీసుకునే మహిళలకు మరింత న్యాయం జరిగిందని నిపుణులు పేర్కొంటున్నారు. చిన్నారుల సంరక్షణ, పెంపకానికి తల్లికి సమయం ఇవ్వడం ఎంతో ముఖ్యమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీంతో భవిష్యత్తులో దత్తత తీసుకునే మహిళలకు ప్రసూతి సెలవుల విషయంలో స్పష్టత ఏర్పడనుందని భావిస్తున్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారు



**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత పదేళ్ల పాలనలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారని ఆరోపించారు. పేదలకు ఇళ్లు అందిస్తామని చెప్పినా ఆ హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారని, వేలాది కుటుంబాలు ఇంకా ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నాయని అన్నారు. డబుల్ బెడ్రూమ్ పథకాన్ని ప్రచారానికి మాత్రమే పరిమితం చేసి ప్రజలను మోసం చేశారని అసెంబ్లీలో విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు గూడు కల్పించడమే ముఖ్య లక్ష్యంగా పనిచేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే రూ. 22,500 కోట్ల వ్యయంతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో పేదల కోసం చేపట్టిన పథకాలు అమలులో అనేక లోపాలు ఉన్నాయని భట్టి విక్రమార్క ఆరోపించారు. పేదల సంక్షేమం కంటే ప్రచారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకుని స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మక నిర్ణయమని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గూడు లేని నిరుపేదలకు సొంత ఇళ్లు కల్పించడం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. పేదలకు భద్రమైన నివాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క అసెంబ్లీలో స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, సామాజిక సమానత్వం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లక్షలాది కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

## కాంగ్రెస్ పాలన డిజాస్టర్‌లా మారింది
## అసెంబ్లీలో కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు కనిపించడంలేదని, ప్రభుత్వం డిజాస్టర్ పాలన కొనసాగిస్తోందని ఆయన మండిపడ్డారు. ఉగాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. కానీ ప్రజల జీవితాల్లో వెలుగులు కనిపించడంలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు అన్న విధానంతో పాలన సాగిస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎగనామాలు, పంగనామాలు ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది ప్రజాపాలన దరఖాస్తులు చేసుకున్నారని, వాటి పరిస్థితి ఏమైందో ప్రభుత్వం చెప్పాలని కోరారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో ఇళ్లకు జీరో విలువ అంటూ ప్రభుత్వం వ్యాఖ్యానించడం సరైంది కాదని కేటీఆర్ అన్నారు. నిజానికి ముఖ్యమంత్రి చేసిన తొలి సంతకానికే జీరో విలువ ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీ కార్డులు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీరో విలువ ఉందని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను తాను కర్ణుడిగా పోల్చుకుంటున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు దానకర్ణుడిలా కనిపించిన ఆయన ఇప్పుడు కుంభకర్ణుడిలా మారిపోయారని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు డిక్లరేషన్లు ప్రకటించేందుకు ఢిల్లీ నుంచి విమానాల్లో వచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసం వినియోగిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన అసెంబ్లీలో డిమాండ్ చేశారు.

## గుజరాత్ తీరానికి ఎల్పీజీ నౌక చేరిక




**జామ్‌నగర్:** ఎల్పీజీ చమురు సరుకుతో కూడిన మరో భారతీయ నౌక మంగళవారం గుజరాత్ తీరానికి చేరుకుంది. ఎంటీ నందాదేవి పేరుగల ఈ నౌక గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారా భారత్‌కు చేరుకున్న రెండో ఎల్పీజీ నౌక ఇదిగా పేర్కొన్నారు. ఈ నౌకలో సుమారు 46,500 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉన్నట్లు సమాచారం. నౌక పోర్టుకు చేరుకున్న వెంటనే చమురును బదిలీ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. దీనదయాళ్ పోర్టు ప్రాధికార సంస్థ ఛైర్మన్ సుశీల్ కుమార్ సింగ్ నౌక వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నౌకలోని ట్యాంకర్ల నుంచి ఎల్పీజీని వెంటనే ఇతర నౌకల్లోకి బదిలీ చేసి ఆయా చమురు యూనిట్లకు తరలించే చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. శివాలిక్, నందాదేవి అనే రెండు నౌకలకు ఈ అనుమతి లభించింది. ఇప్పటికే శివాలిక్ నౌక సోమవారం భారత్‌కు చేరుకుంది. ఆ నౌకలో సుమారు 40,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ నౌకలు సురక్షితంగా భారత్ చేరుకునేందుకు ఇరాన్ సహకారం అందించినట్లు సమాచారం. కాగా 81,000 మెట్రిక్ టన్నుల ముడి చమురు సరుకుతో జాగ్ లాడ్కి అనే మరో నౌక ప్రస్తుతం మార్గమధ్యలో ప్రయాణిస్తోంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఇంకా 22 భారతీయ నౌకలు చిక్కుకుని ఉన్నట్లు సమాచారం.

## మల్లారెడ్డి కాలనీలో ట్రాఫిక్ సమస్యపై మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పర్యటన



**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మార్చి 17 మన వార్త :**అల్వాల్ సర్కిల్ పరిధిలోని మల్లారెడ్డి కాలనీలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ సమస్యపై నివాసితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి కూడా హాజరై సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు.ప్రాంతంలో పెరుగుతున్న వాహన రద్దీ కారణంగా రోజువారీ జీవనంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పీక్ అవర్స్ సమయంలో రోడ్లపై వాహనాల రాకపోకలు నియంత్రణ తప్పిపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న చంద్రాపురం కాలనీ రోడ్డును వెంటనే శుభ్రపరచి, అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ఆ రహదారి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గి వాహన రాకపోకలు సాఫీగా సాగుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న అనంతరం, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి కూడా సమస్య తీవ్రతను గుర్తించి, రహదారి విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ పర్యటనలో కాలనీ ప్రతినిధులు విశ్వేశ్వరరావు (అధ్యక్షుడు), నిఖిల్ (వర్కింగ్ అధ్యక్షుడు), కిరణ్ (జనరల్ సెక్రటరీ), హరి ప్రసాద్ (వైస్ ప్రెసిడెంట్), రమణ మూర్తి (ఖజాంచి), భాస్కర్ రావు (సలహాదారు) తదితరులు పాల్గొన్నారు.ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కనాజిగూడ బస్తీలో డ్రైనేజ్ సమస్యపై అధికారులతో కలిసి పర్యటన



**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మార్చ్ 17 మన వార్త :** అల్వాల్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని కానాజిగూడ బస్తీలో నెలకొన్న డ్రైనేజ్ సమస్యపై స్థానిక ప్రజల ఆవేదనల నేపథ్యంలో, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ప్రాంతాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా అధికారులు బస్తీలోని డ్రైనేజ్ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వివరించారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమంగా మారుతుందని, దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.సమస్యను గమనించిన అధికారులు దీనిని పూర్తిగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డ్రైనేజ్ లైన్ల మరమ్మతులు, శుభ్రత చర్యలు చేపట్టడం ద్వారా సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు అనిల్, సతీష్, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, విజయ్ శేఖర్, అలాగే బస్తీ నివాసులు వీరేశ్, సదానంద్, కన్నా, నరేష్, ప్రభాకర్, మధు, డేవిడ్, శంకర్, సురేష్, యాదగిరి, జమున, కళావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా మేనేజర్ సంపత్...



**రామాయంపేట మార్చి 17 ( మన వార్త ప్రతినిధి)** రామాయంపేట 108 అంబులెన్స్ సిబ్బంది పనితీరు బాగుందని ఎక్కడ ఆరోగ్యపరంగా ఫోన్ వచ్చిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన ఘనత రామాయంపేట అంబులెన్స్ సిబ్బందికి దక్కిందని వారికి ప్రశంసా పత్రాల అందించే విధంగా పూర్తి నివేదిక జిల్లా అధికారులకు రాష్ట్ర ప్రభుత్వానికి అందించడం జరుగుతుందని 108 ఉమ్మడి మెదక్ జిల్లా మేనేజర్ సంపత్ తెలిపారు. రామాయంపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న 108 అంబులెన్స్ ను ఆయన తనిఖీ చేశారు, అంబులెన్స్ లో ఉన్న మందులను పరిశీలించారు అనంతరం వారు చేస్తున్న కేసులకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయంపేటలో 108 అంబులెన్స్ మెదక్ జిల్లాలోని ప్రథమ స్థానంలో ఉన్నదని ఎక్కడలేని విధంగా వారి సేవలు అందించడం జరుగుతుందని సుమారు ప్రతిరోజు 10 కేసుల వరకు వారు ఆసుపత్రికి తీసుకువచ్చి వారి ప్రాణాలను రక్షించడం జరుగుతుందని తెలిపారు, జిల్లాలోని ప్రథమ స్థానంలో ఉన్న రామాయంపేట 108 అంబులెన్స్ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించే విధంగా పూర్తి నివేదికను జిల్లా అధికారులకు రాష్ట్ర ప్రభుత్వానికి అందించడం జరుగుతుందని అన్నారు, అదేవిధంగా వేసవికాలం దృష్టిలో పెట్టుకొని వడదెబ్బ బాధితులకు కూడా వైద్యం అందించేందుకు ప్రతి 108 అంబులెన్స్ లో వారికి సంబంధించిన మందులు ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 అంబులెన్స్ ఉమ్మడి మెదక్ జిల్లా మేనేజర్ సంపత్, రామాయంపేట 108 అంబులెన్స్ పైలట్ ఆసిఫ్, ఇఎంటి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## పోలీసుల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం



**గజ్వేల్ మార్చ్ 17 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మంగళవారం పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక "99 రోజుల' కార్యాచరణలో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 63 మంది పోలీసు సిబ్బందికి ఈ శిబిరంలో సుమారు 59 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా, సొంత ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు, ప్రజల రక్షణ సాధ్యమవుతుంది. విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సూచించారు. ఈ వైద్య శిబిరంలో పోలీసులకు రక్తపోటు, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి, ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన, రచన, శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గజ్వేల్ లో మున్సిపల్ అధికారుల ఇంత నిర్లక్ష్యమా

**గజ్వేల్ మార్చ్ 17 మన వార్త ప్రతినిధి** గజ్వేల్ లో ఎక్కడ చూసినా ఏ వార్డులలో చూసిన ఈవినింగ్ 5:30 నుంచి దోమలు విపరీతంగా గజ్వేల్ మున్సిపాలిటీ ప్రజలు ఎక్కడన్నా కూర్చున్నా గాని ఒక్క మనిషికి 100 దోమలు ఆలుతున్నాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో గత ఏడాది నుంచి ప్రజలను పట్టించుకునే నాధుడే లేడు. శానిటైజర్స్ గాని దోమల మందులు గాని దోమల పొగ గాని ఇప్పటివరకు చేయడం లేదు. కనీసం చెత్త డబ్బాలు కూడా ఇవ్వలేదు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఇంత దారుణంగా జరుగుతుంది మురికి కాలువలు గాని దోమలు మోరీలలో నిండుగా నీరు ఉండడం వల్ల మీద బహిరంగంగా ప్లేస్ లలో గాని ఎక్కడబడితే అక్కడ విపరీతంగా దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమల కారణాలుగా ప్రజల అనారోగ్యాల జబ్బులు దోమల వలన వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపాలిటీలో అన్ని వార్డులలో దోమల పొగ గాని మోరీలు గాని చెత్త బుట్టలు గాని అన్ని వార్డులలో ఇవ్వాలని కోరుతున్నాం. ఫస్ట్ వార్డు లో మర్రి చెట్టు దగ్గర ఊరిలో నిండుగా మురికి నీరు ఉండడం జరుగుతుంది ఆ నీరు వర్షాలు పడితే ఇండ్ల లోపలికి వచ్చేస్తూ ఉన్నాయి వల్ల ముందట ఉన్న ఇండ్ల లో ఉండే ప్రజలు అనారోగ్య పాలవుతున్నారు. దీనిని వెంటనే అధికారులు స్పందించి పరిష్కారం ఫస్ట్ వార్డ్ ప్రజలు చేయగలరని కోరుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల పార్టీ



**-జిల్లా కాంగ్రెస్ పార్టీ ధ్యక్షులు సంగీతం శ్రీనివాస్...**

**ఎల్లారెడ్డి పేట మార్చి 17: (మన వార్త ప్రతినిధి)**కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల పార్టీ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ ధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అన్నారు,ఎల్లారెడ్డిపేట మండలం అక్క పెల్లి గ్రామంలో బత్తుల రాజమణి ఆశయ్య బండ లింగంపల్లి గ్రామంలో మెతుకు సుజాత బాలచందర్ యాదవ్ లు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని మంగళవారం గృహప్రవేశ వేడుకలు జరుపుకున్నారు, ఈ సందర్భంగా అక్క పల్లీలో ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేర బేగం గౌస్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు తో కలిసి రిబ్బన్ కత్తిరించి గృహప్రవేశం ప్రారంభించారు. అదేవిధంగా బండ లింగంపల్లి గ్రామంలో మెతుకు సుజాత బాలచందర్ యాదవ్ ల ఇందిరమ్మ ఇళ్ళు నూతన గృహాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఏఎంసి చైర్మన్ షేక్ సాబేరా బేగం స్థానిక సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్ తో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు, జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ రేషన్ కార్డులు లేని వారికి రేషన్ కార్డులు ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అని అన్నారు, ఏఎంసి చైర్మన్ షేక్ సాబేరా బేగం మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దొమ్మటి నరసయ్య లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా ఇస్తామని ప్రకటించడం పట్ల రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు, ప్రతిపక్ష పార్టీలు దీనిని రాజకీయం చేస్తున్నాయని ఆయన విమర్శించారు, గతంలో బేస్మెంట్ వరకు నిర్మించుకున్న ఇళ్లకు నాలుగు లక్షల రూపాయల చొప్పున ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు, నియోజకవర్గంలో అభివృద్ధికి సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి నిధులు ఇప్పించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య పంచాయతీ కార్యదర్శులు కృష్ణ యాదవ్ పవిత్ర గ్రామ శాఖ అధ్యక్షులు జంగ భూంరెడ్డి బాల్రాజ్ రమేష్ గౌడ్ ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ బాయ్ జిల్లా అధ్యక్షులు సాహెబ్ నాయకులు వంగ గిరిధర్ రెడ్డి మర్రి శ్రీనివాస్ రెడ్డి బండారి బాల్రెడ్డి జంకె లచ్చిరెడ్డి జంకె జనార్దన్ రెడ్డి పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గుర్రాల రాజిరెడ్డి మెండే శ్రీనివాస్ యాదవ్ , ఎల్లా గౌడు సిరిపురం మహేందర్ దొమ్మాటి రాజు ఆకారం రాజు పడిగేల రవి గుప్తా తదితరులు పాల్గొన్నారు,

## తెలుగుదేశం పార్టీకి గంజి నారాయణ సేవలు చిరస్మరణీయం

**-ప్రజల కోసం అంకితభావంతో పనిచేసే నేత గంజి నారాయణ...**

**-నారాయణ మరణం బాధాకరం...**

**-నారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించిన మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత...**



**మధిర, మార్చి17( మన వార్త ):**గంజి నారాయణ తెలుగుదేశం పార్టీకి ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం అన్నారు.మధిర పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ తెలుగు రైతు సంఘం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గంజి నారాయణ సోమవారం రాత్రి మృతి చెందారు.నారాయణ మృతి వార్త తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత,మధిర పట్టణ కాంగ్రెస్ నేతలతో కలిసి నారాయణ పార్థివ దేహాన్ని సందర్శించి పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గంజి నారాయణ తన జీవితమంతా కార్మికులు, రైతులు,పేద ప్రజల కోసం అంకితభావంతో పనిచేశారని అన్నారు.పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి,విలువలను కాపాడుతూ ముందుకు నడిపించిన నేత గంజి నారాయణ అని పేర్కొన్నారు.ఆయన మరణం బాధాకరమని అయన ఆత్మకు శాంతి కోరుకున్నారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు,కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరావు, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి, నిడమానూరు వంశీ కృష్ణ,పులిబండ్ల చిట్టిబాబు, మువ్వ వెంకయ్య బాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ తదితరులు ఉన్నారు.

## గాగిల్లాపూర్ లో 10 లక్షల నిధులతో సిసి రోడ్డునిర్మాణం



**బెజ్జంకి, మార్చి 17(మన వార్త ప్రతినిధి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం గ్రామంలో మంగళవారంమహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధులు 10 లక్షల రూపాయల విలువ గల సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ ఎర్రల జానకిరాజు ఆధ్వర్యంలో భూమిపూజ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పులిక్రిష్ణ , వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,బెజ్జంకి మండల అధ్యక్షులు రత్నాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ చింతలపల్లి పద్మ,వార్డు సభ్యులు బండిపెల్లి రమేష్, తడ్కపల్లి పవన్, చింతలపల్లి లతా కొండాల్ రెడ్డి, కొమిరే రమ శ్రీనివాస్ ,కల్లేపల్లి లక్ష్మీ శ్రీనివాస్, బొమ్మరవేణి వాసవి వెంకటేష్, చాతవేణి మహేష్, సొల్లు బాలయ్య, న్యాలం శారద శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పైడిపల్లి శంకర్,పంచాయతీ కార్యదర్శి పాము రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సహాయం చేయడం ద్వారానే పరమార్థ సిద్ధిస్తుంది



**మధిర,మార్చి17( మన వార్త ):**పేదలకు సహాయం చేయడం ద్వారానే పండుగ పరమార్థం సిద్దిస్తుందని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం అన్నారు.పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం అందించిన తోఫా ను మున్సిపల్ చైర్మన్ సుజాత రామనాథం,ఆ సంఘం నేతలు మౌలానా షేక్ ముజాహిద్,షేక్ హుస్సేన్ సాహెబ్ లతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ సుజాత రామనాథం మాట్లాడుతూ,పేదల ఆకలిని గుర్తించిన తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్- రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ లు సంఘం ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ సందర్భంగా మధిర నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల రెండు వందల ముస్లిం కుటుంబాలకు 16 లక్షల రూపాయల విలువైన నిత్యవసర ఆహార పదార్థాలతో కూడిన కిట్టు (రంజాన్ తోఫా)అందజేయటం అభినందనీయమని అన్నారు.పవిత్ర రంజాన్ పండుగ క్రమ శిక్షణకు, దాతృత్వానికి ఒక అద్భుతమైన మార్గమని, ఉపవాస దీక్షలు మనిషిలో ఆధ్యాత్మిక చింతనను, సహనాన్ని రెట్టింపు చేస్తాయని తెలిపారు.పేదల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి ఆనందాన్నిస్తుందిసంపాదించిన దానిలో కొంత భాగాన్ని పేదలకు సహాయం చేయాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని,పేదల కోసం ఖర్చు పెట్టే ప్రతి పైసా ఆనందాన్నిస్తుంది అని తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం నేతలు మౌలానా షేక్ ముజాహిద్,షేక్ హుస్సేన్ సాహెబ్ అన్నారు.ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా బియ్యం,గోధుమ పిండి,సేమియా, సేమియా, పంచదార,జీడిపప్పు, కిస్మిస్,ఖర్జూరం,నెయ్యి, బిర్యానీ మసాలా,బన్ కేక్,తదితర నిత్యవసర సరుకులతో కూడిన కిట్టును అందించటం సంతోషంగా ఉందన్నారు.గత మూడేళ్ల నుంచి ఎవరి సిఫారసు ఎవరి ప్రమేయం లేకుండానే నిరుపేదలను గుర్తించి సహాయం అందిస్తున్నామని తెలిపారు.అల్లా కృపతో భవిష్యత్తులో మరిన్ని పేద కుటుంబాలకు విద్యా, వైద్యం అందించేందుకు తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం కృషి చేస్తుందన్నారు.

## అక్షయ అగ్రికేర్ ఎండి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో గోలి సంతోష్ కు ఘన సన్మానం



**గజ్వేల్ మార్చ్ 17 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో మంగళవారం అక్షయ అగ్రికేర్ ఏం డి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్, రెండవ వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్ కు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారంలో రాణిస్తూ, నిస్వార్థంగా ప్రజాసేవలో, ఉంటూ, రైతు శ్రేయస్సు తోపాటు సమాజ శ్రేయస్సు లక్ష్యంగా ముందుకు సాగుతున్న గోలి సంతోష్ పలువురికి ఆదర్శవంతుడని, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గోలి మమత సంతోష్ కౌన్సిలర్ గా ఎన్నికవ్వడం సంతోషంగా ఉందని వారికి చిరు సన్మానం చేసి, అభినందనలు తెలపడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో అక్షయ అగ్రికేర్ గజ్వేల్ సూపర్వైజర్ బాలరాజు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సిరికొండ ఆదర్శ పాఠశాలలో పర్యావరణ చైతన్యం: వర్మీ కంపోస్ట్, ఇంకుడు గుంతలపై విద్యార్థులకు అవగాహన



**నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం (మన వార్త) మార్చ్ 17** సిరికొండ మండల కేంద్రంలోని పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో ఏకో క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వర్మీ కంపోస్ట్ (వానపాముల ఎరువు) మరియు ఇంకుడు గుంతల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పాఠశాలలో ఏర్పడే చెత్త, మధ్యాహ్న భోజన వ్యర్థాలను వృథా చేయకుండా వర్మీ కంపోస్ట్ పిట్స్ ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చుకునే విధానాన్ని ఆయన ప్రత్యక్షంగా వివరించారు. దీనివల్ల రసాయనాల లేని స్వచ్ఛమైన ఎరువు సిద్ధమవుతుందని తెలిపారు. అలాగే భూగర్భ జల మట్టాన్ని పెంచడంలో ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను వివరించిన ఆయన, వర్షపు నీరు మరియు వృథా నీరు రోడ్లపైకి వెళ్లకుండా గుంతల ద్వారా భూమిలోకి జొరగేలా చేస్తే భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ ఇళ్ల వద్ద కూడా వర్మీ కంపోస్ట్ గుంతలు మరియు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏకో క్లబ్ ఇంచార్జ్ జమున మేడం, సాయి వినయ్ సార్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొట్టాల శ్రీనివాస్ ముదిరాజ్ కు ఘన సన్మానం



**గజ్వేల్ మార్చ్ 17 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రానికి చెందిన ప్రముఖ సివిల్ కాంట్రాక్టర్ కొట్టాల శ్రీనివాస్ ముదిరాజ్ కు మంగళవారం చేగుంట మండల కేంద్రంలో ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి తలారి బిక్షపతి ముదిరాజ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్టాల శ్రీనివాస్ ముదిరాజ్ వ్యాపార రంగంలో రాణిస్తూ సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ ముదిరాజ్ సంఘం బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తున్నారని రాబోయే కాలంలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాయిని యాదగిరి, ఎనుముల రామకృష్ణారెడ్డి, పిట్ల అంజనేయులు, చిట్కుల శివారెడ్డి, ముత్యాలు, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిమ్ లకు దుస్తుల పంపిణి


**-వీర్నపల్లి మండలం కి 40 ఎల్లారెడ్డిపేట మండలానికి 260 ఈద్ కా తోఫా మంజూరు...**

**ఎల్లారెడ్డి పేట మార్చి 17 : (మన వార్తా ప్రతినిధి)**ముస్లింల పవిత్రమైన పండుగ రంజాన్ (రమదాన్) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ఎల్లారెడ్డిపేట వీర్నపల్లి మండలాలకు చెందిన ముస్లింలకు 300 (ఈద్గా తోఫా ) దుస్తులు మంజూరు చేయగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ముస్లిం



మైనార్టీ కమిటీ కార్యాలయం లో ముస్లీమ్ లకు ముస్లిం మైనారిటీ కమీటి సదర్ లు జాంగీర్ ఆయూబ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి మండల సర్పంచుల పోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు సాహెబ్ ఆద్వర్యంలో మంగళవారం ముస్లింలకు దుస్తులు పంపిణి చేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి గిరిదర్ రెడ్డి బండారి బాల్ రెడ్డీ గుర్రం రాములు పందిర్ల శ్రీనివాస్ గౌడ్, రవి యాదవ్, మెండె శ్రీనివాస్ యాదవ్ గుర్రాల రాజిరెడ్డి రఫిక్ అబ్జల్ షకీల్ ముస్లిం మైనార్టీ మండల కమిటీ నాయకులు లాల్బాయి షకీల్ బాయి సాధుల్ డీలర్ బాబా ముస్లీమ్ యూత్ నాయకులు షాబోద్దీన్ రఫిక్ అబ్జల్ బాయి సాహెబ్ బాయి తదితర ముస్లిం మైనార్టీ మండల కమిటీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కర్ రంజాన్ సందర్భంగా పంపిణి చేసిన దుస్తులు చాలా బాగున్నాయని ముస్లీమ్ లు సి ఎం రేవేంత్ రెడ్డి కి రాష్ట్ర వక్ఫ్ బోర్డు చేర్మెన్ ఆజ్మాతుల్లా హూస్సేన్ కు కృతజ్ఞతలు తెలిపారు

## కామారెడ్డిలో విద్యార్థుల ఉత్సాహం ఉరకలు ఉదయ డిఫెన్స్ అకాడమీ డెమో క్లాసులు ఘన విజయం



**నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం (మన వార్త) మార్చ్ 17** కామారెడ్డి పట్టణంలోని ఉదయ డిఫెన్స్ అకాడమీలో సోమవారం నిర్వహించిన డెమో క్లాసులు ఘనవిజయాన్ని సాధించాయి. గ్రూప్స్, ఎస్ఐ, కానిస్టేబుల్, ఆర్మీ, ఎస్ఎస్సీ జీడీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించి నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారీగా విద్యార్థులు హాజరయ్యారు. అకాడమీ అధ్యక్షులు సిరికొండ మండలం హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన పి. రాజేశ్వర్ (రిటైర్డ్ ఆర్మీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ఫ్యాకల్టీ సభ్యులు భరత్, డేవిడ్, నాగేశ్ విద్యార్థులకు పరీక్షల సిద్ధతపై ప్రాముఖ్యమైన సూచనలు, వ్యూహాలు వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. కె. గ్రూప్ ఆఫ్ కాలేజెస్ సీఈఓ డా. ఎం. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలంటే కష్టపాటు, క్రమశిక్షణ, పట్టుదల అనివార్యమని పేర్కొన్నారు. ఆయన విద్యార్థులను లక్ష్యసాధన వైపు దిశానిర్దేశం చేశారు. డెమో క్లాసులకు హాజరైన విద్యార్థులు బోధనపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత నాణ్యమైన శిక్షణ అందించేందుకు కట్టుబడి ఉన్నామని అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

## ప్రతి ఒక్కరిలో భక్తి భావన పెంపొందించుకోవాలి...



**రామాయంపేట సెప్టెంబర్ 17 ( మన వార్త ప్రతినిధి)** రామాయంపేట మున్సిపల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రాంపూర్ పీఠాధిపతి శ్రీ మాధవనంద సరస్వతి స్వామీజీ సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు లతో కలిసి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు, దేవాలయ అభివృద్ధి కోసం సహకారాన్నిస్తున్న దాతలను మున్సిపల్ చైర్మన్ శాలువలతో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైతే భగవంతుడిపై ప్రేమ విశ్వాసం ఉంటుందో వారికి భగవంతుడు ప్రేమా మయుడుగా కనిపిస్తాడని, రామయంపేట పట్టణంలోని కొండపై లక్ష్మీనరసింహస్వామి ఆశ్రయం పొందాడని వివిధ అవతారాల్లో నరసింహస్వామి దర్శనం ఇస్తాడని స్వామివారిని ప్రేమతో కొలిస్తే భక్తుల కోరికలు అన్నీ కూడా నెరవేరుస్తాడని ఆయన అన్నారు ప్రతి ఒక్కరు భక్తి భావనతో మెలగాలని దేవుడిని పూజిస్తే ఆ ఫలితం తప్పకుండా దేవుడు చూపిస్తాడని ప్రతి ఒక్కరూ దేవాలయాల వద్దకు వెళ్లి దర్శనం చేసుకొని ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారికి సేవలు చేసుకోవాలని తెలిపారు, దేవాలయాల ఏర్పాటు కాకుండా దేవాలయాల వద్ద ప్రతినిత్యం దీప ధూప నైవేద్యం కోసం కృషి చేయడం జరుగుతుందని దేవాలయంలో ప్రతినిత్యం పూజలు చేసే విధంగా పూజారి వెంకటరమణాచారిని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో రాంపూర్ పీఠాధిపతి శ్రీ మాధవంద సరస్వతి స్వామీజీ, మున్సిపల్ చైర్మన్ లావణ్య నాగరాజు వైస్ చైర్మన్ నవనీత గణేష్ మున్సిపల్ కౌన్సిలర్లు స్వప్న కుమార్, గజవాడ నాగరాజు, శంకర్ గౌడ్, సందీప్, రంజిత్, రవి, మహంకా దేవాలయ కమిటీ డైరెక్టర్ సంతోష్, మాజీ ఎంపీపీ రమేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దేమే యాదగిరి, ఎనిశెట్టి అశోక్, యాదగిరి, రాము, చింతల స్వామి, చింతల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నివారణ కోసమే హెచ్పివి వ్యాక్సిన్...

**-వ్యాక్సిన్ పై ఎలాంటి అపోహలు వద్దు మున్సిపల్ చైర్మన్ లావణ్య నాగరాజు....**

**రామాయంపేట మార్చి 17 ( మన వార్త ప్రతినిధి)** హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకుంటే ఎలాంటి సైడ్ ఎఫెక్టు ఉండదని 14 నుండి 15 సంవత్సరాలలోపు బాలికలందరూ కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలని గర్భాశయ క్యాన్సర్ వ్యాధి నివారణ కోసం ఈ వ్యాక్సిన్ ఉ



పయోగపడుతుందని మున్సిపల్ చైర్మన్ బెజవాడ లావణ్య నాగరాజు తెలిపారు, రామాయంపేట మున్సిపల్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలికల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం హెచ్పివి వాక్సినేషన్ ఏర్పాటు చేయడం జరిగింది నేడు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో హెచ్పివి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ చైర్పర్సన్ బెజవాడ లావణ్య నాగరాజులు ప్రారంభించారు, ప్రారంభోత్సవానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ లావణ్య నాగరాజు వైస్ చైర్మన్ నవనీత గణేష్ లను ఆసుపత్రి సూపరిండెంట్ లింబాద్రి తో పాటు వైద్య సిబ్బంది శాలువాలతో సన్మానించారు, ఈ సందర్భంగా డిఐఓ డాక్టర్ మాధురి, ఆసుపత్రి సూపరిండెంట్ లింబాద్రి, మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య నాగరాజు,, కౌన్సిలర్ గజవాడ నాగరాజు లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు గర్భకోశ క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా 14 నుండి 15 సంవత్సరాలలోపు బాలికలు అందరికీ హెచ్పీవీ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యంగా తల్లులు తమ పిల్లలకు కచ్చితంగా ఈ వ్యాక్సిన్ ఇప్పించాలని వాడుకోరారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య నాగరాజు వైస్ చైర్పర్సన్ నవనీత గణేష్ డి ఐ ఓ డాక్టర్ మాధురి ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ లింబాద్రి, కౌన్సిలర్లు చౌదరి చరిత, గజవాడ నాగరాజు, శంకర్ గౌడ్, పుట్టి సందీప్, మాధవి రమేష్, రంజిత్, రవి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు స్వామి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, నాయకులు చింతల యాదగిరి, అల్లాడి వెంకటేష్, ఎనిశెట్టి అశోక్, దామోదర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు,

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ...



**శంకరపట్నం:మార్చి17(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం మెట్పల్లి రైతు వేదికలో మంగళవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై విస్తృత అవగాహన సదస్సు,శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జమ్మికుంట కే,వి,కే కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. రసాయన ఎరువులు,పురుగుమందుల వల్ల నేల సారవంతత తగ్గడం ఖర్చులు పెరగడం వంటి సమస్యలకు ప్రకృతి వ్యవసాయం ఒక స్థిరమైన ప్రత్యామ్నాయమని తెలిపారు. తక్కువ ఖర్చుతో నేల ఆరోగ్యం మెరుగుపరచడం పంట నాణ్యత పెంపు మరియు రైతుల ఆదాయం పెరగడంలో ప్రకృతి వ్యవసాయం కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. రైతులకు జీవామృతం,ఘన జీవామృతం,బీజామృతం,వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను స్పష్టంగా తెలియజేశారు. రసాయనాల వినియోగాన్ని తగ్గిస్తూ పూర్తిగా సహజ విధానాలకు మారాలని రైతులకు సూచించారు. మొలంగూర్,మెట్పల్లి కి చెందిన 105 మంది రైతులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమారస్వామి,ఉప సర్పంచ్ గొట్టే మధు,హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి,కరీంనగర్ ఆత్మ పీడి చత్రు నాయక్,మానకొండూర్ ఆత్మ చైర్మన్ దావా శ్రీనివాస్ రెడ్డి,ఏవో వెంకటేష్,గుడాటిపల్లి ఉపసర్పంచ్ సుభాష్ రెడ్డి,ఏఈఓ లు తిరుపతి,కీర్తన,రాజ్ కుమార్, సీఆర్పీ లు కవ్వ పద్మ,జహేదా,రైతులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించిన అధికారులు...

**- ప్రకృతి వ్యవసాయ సేవకు రైతులు ముందుకు రావాలి ఏ డి ఏ విజయనిర్మల...**

**చిన్న శంకరంపేట మార్చి 17( మన వార్త ప్రతినిధి)** ప్రకృతి వ్యవసాయ సాగుకు రైతులు ముందుకు రావాలని ఏడిఏ



విజయనిర్మల సూచించారు మంగళవారం చిన్న శంకరంపేట మండల కేంద్రం లోని రైతు వేదికలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ విజయనిర్మల మాట్లాడుతూ ప్రకృతి సాగు భూమికి రక్ష అని తెలిపారు ప్రకృతి వ్యవసాయ సాగు కోసం మండలంలోని మదూర్, సంగాయపల్లి, గజగట్లపల్లి, రుద్రారం, టీ మాందాపూర్, గ్రామాల్లోని ఒక్కొక్క గ్రామంలో 125 మంది చొప్పున 625 మంది రైతులను ఎంపిక చేయడం జరిగిందన్నారు, ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు శిక్షణ ఇవ్వడం కోసం ముగ్గురిని సీఆర్పీలను నియమించడం జరిగిందన్నారు, సి ఆర్ పి లు ప్రతినెల రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు, ప్రకృతి వ్యవసాయ సాగు విధానంతో పండించిన పంటలకు అధిక ధర లభిస్తుందన్నారు రసానిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకొని సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రవీణ్, ఏఈవోలు శ్యామ్, మధుమిక, రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా యంత్రాలు, ఇతర పరికరాలు సిద్ధం చేయాలి



**బెజ్జంకి, మార్చి 17(మన వార్త ప్రతినిధి )**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం మార్కెట్ కమిటీ చైర్మన్ పులిక్రిష్ణ ఆధ్వర్యంలో పాలక వర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. రాబోయే పంట సీజన్ దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలకు మిషన్ కొనుగోలు లు కేంద్రాలకు కావలిసిన అన్ని పరికరాలను సకాలంలో ఏర్పాటు చేయాలని మార్కెట్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వెంకటయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి డైరెక్టర్ లు సంతోష్,మల్లేశం, పోచయ్య,రాజు, నర్సయ్య,చంద్రారెడ్డి, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు

## ఆశ వర్కర్లకు శాశ్వత వేతనం నిర్ణయించాలి...

**-ఆశ వర్కర్లకు నిర్ణయించాలని ఆశ వర్కర్ల జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 17** మంగళవారం రోజున సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా



కలెక్టర్ కార్యాలయం ముందు ఆశ రాష్ట్ర బడ్జెట్లో బడ్జెట్ కేటాయించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ పనిచేస్తున్న ఏళ్ల తరబడిగా పట్టణాల్లో గ్రామాల్లో ప్రజలకు అందు బాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్ పెట్టండి నిర్ణయించ కుండా చాకిరి చేయించు కుంటున్నదని,బడ్జెట్లో రాష్ట్ర బడ్జెట్లో ఆశ వర్కర్లకు బడ్జెట్ కేటాయించి శాశ్వత నిర్ణయించి వేతనాలు పెంచాలని నిర్వహించాలని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఆశ వర్కర్లకు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన నేటికీ అమలు చేయ లేదని వెంటనే ఎప్పటికైనా వెంటనే బడ్జెట్ కేటాయించి నిర్ణయించాలని తగ్గించాలని ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆపాలని తదితర సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ , అంగన్వాడీ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముక్కెర్ల వెంకటమ్మ , కసగోని లలిత , నాయకులు జ్యోతి , సంతోష , సుజాత , నామల జమున , అరుణ , ధనలక్ష్మి , సైదమ్మ , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించిన పోలీసులు...

**-ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు...**

**చిన్న శంకరంపేట మార్చి 17 ( మన వార్త ప్రతినిధి)** రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి ఏటా దేశంలో 1,50,000 మంది ప్రాణాలను కోల్పోతున్నారని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు, మంగళవారం చిన్న శంకరంపేట మండలం చందంపేట గ్రామ శివారులోని ఎం ఎస్ ఎన్ పరిశ్రమలో కార్మికులకు, రోడ్డు ప్రమాదాల నివారణపై అరైవ్ అలైవ్ అవగాహన సదస్సు నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం మూలంగానే 95% ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు, ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో 8,000 మంది మరణిస్తున్నారని మరో 20 శాతం మంది తీవ్రంగా గాయపడి మరి కొంతమంది వికలాంగులుగా మారుతున్నారని తెలిపారు, ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చున్నారు, హత్యలకంటే ఎక్కువ ప్రమాదాల వల్ల మరణిస్తున్నారన్నారు పది వాహనాలను తనిఖీ చేస్తే ఏడు మంది వాహన డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడుపుతున్నారని గుర్తు చేశారు, మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు, వాహన డ్రైవరు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు, సీటు బెల్టు పెట్టుకోవడం మూలంగా బెలూన్ తెరుచుకుంటాయన్నారు ప్రతి ఏటా జిల్లా వ్యాప్తంగా 350 మంది మృతి చెందుతున్నారని తెలిపారు, అన్ని శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు, అనంతరం రోడ్డు భద్రత నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించారు, సేవ్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు బ్రీత్ అండ్ ఎలైజర్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ రామాయంపేట సిఐ వెంకట్ రాజా గౌడ్, సేవ్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ నూర్ కేత్రి పాల్, ఎస్సై ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, చిన్న శంకరంపేట ఎస్సై నారాయణ గౌడ్,పోలీస్ సిబ్బంది, సేవ్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పరిశ్రమ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు



## బాధితులకు ఆర్థిక సాయం

**-ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు,మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి..**

**వాజేడు మార్చి 17 మనవార్త** మండలంలోని మురుమూర్ గ్రామపంచాయతి పరిధిలోనీ బొల్లారం గ్రామంలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైన ఇంటి వద్దకు ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి వెళ్లి బడిశా రాధా కుటుంబాన్ని పరామర్శించి,3 వేల రూపాయలు,25 కేజీ లా బియ్యం అందజేశారు.బాధిత కుటుంబానికి ఐటీడీఏ నుండి టీఆర్ ఎఫ్ ఫండ్ అందించాలని అన్నారు.అదేవిధంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంచర్ల నాగేశ్వరావు,పార్టీ నాయకులు బట్ట నాగేందర్, మురుమూర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పూసం నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## బెజ్జంకిలో పోలీసులకు ఆరోగ్య వైద్య శిభిరం

**బెజ్జంకి, మార్చి17(మనవార్త ప్రతినిధి )**సిద్దిపేట కమిషనర్ రష్మీ పెరుమాళ్ఆదేశాల మేరా ఆరోగ్య ఖాకీ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల సమన్వయంతో సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని బెజ్జంకి మండల పోలీసుఅధికారులకు,సిబ్బందికి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ ఆరోగ్య శిభిరంలో స్థానిక ఎస్సై బోయిని సౌజన్య,ఏఎస్ఐ శంకర్ రావు,పోలీసు సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించి రక్తపోటు,మధుమేహ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి,ఆరోగ్య పరంగా పలు సూచనలు ఇవ్వడం జరిగింది.విధులు నిర్వహించే సమయంలో ఒత్తిడికి లోనవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి వైద్యులు సూచించారు.ఈ ఆరోగ్య శిభిరం సిద్దిపేట కమిషనరెట్ పరిధిలోని అన్నీ పోలీసు స్టేషన్ లోని పోలీసు అధికారులకు,సిబ్బందికి ఆరోగ్య ఖాకీ కార్యక్రమం ద్వారా దశలవారీగా నిర్వహించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.



## సివిల్ కేసుల పరిష్కారానికి న్యాయ వాదులు పూర్తి సహకారం అందించాలి...




**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 17** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ,యాదాద్రి భువనగిరి అధ్యక్షులు,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు సూచనలమేరకు , సంస్థ కార్యదర్శి వి. మాధవి లత భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు , న్యాయవాదులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. వెంకటయ్య గౌడ్ , కార్యదర్శి బొల్లేపల్లి కుమార్ , ట్రెజరర్ చంద్రశేఖర్ రెడ్డి , సీనియర్ , జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత మాట్లాడుతూ మార్చి 28వ తేదీ శనివారం రోజున నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో అధిక సివిల్ కేసుల పరిష్కారానికి న్యాయ వాదులు తగిన సహకారం అందజేయాలని , రాజీతో చేసుకునే వివాద పరిష్కార ప్రయోజనాన్ని కక్షిదారులకు తెలియ జేయాలని , సంబంధిత కేసులలో న్యాయ వాదులు కక్షిదారులకు తగు సలహాలు ఇచ్చి సివిల్ దావాల పరిష్కారానికి కృషి చేయాలని , తద్వారా సివిల్ దావా తగాదాలతో సంబంధం ఉన్న క్రిమినల్ కేసులు కూడా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని దీని ద్వారా కక్షిదారులు స్నేహపూర్వకంగా ఉండటమే కాకుండా తమ జీవితాలలో కక్షలు , శత్రుత్వాలు లేకుండా నైతికంగా , ఆర్థికంగా వారి జీవనాన్ని మెరుగుపరచు కోవడానికి అవకాశం ఉంటుందని , ఇటువంటి రాజీ పరిష్కారం న్యాయ సేవ అధికార సంస్థ చట్టంలోని లోకదాలత్ చట్టం ద్వారా వెసులుబాటు కల్పించిందని రాజీకి ఆమోదయోగ్యమైన కేసులను పరిష్కరించడంలో, కేసుల పెండెన్సీ తగ్గించడంలో ఎంతో ఉపయోగపడు తుందని , రాజీ పడినటు వంటి కేసులలో కక్షిదారులు చెల్లించిన కోర్టు రుసుము కూడా తిరిగి చెల్లించ బడుతుందని కక్షిదారులకు తెలిపేటట్లు అవగాహన చేయాలని , 28 మార్చి 2026 వరకు ప్రతిరోజు భువనగిరి కోర్టు ప్రాంగణంలో ప్రి సెట్టింగ్స్ ద్వారా కేసులు పరిష్కారం చేసుకొనుటకు కక్షిదారులకు వెసులుబాటు కల్పించడం అయినదని తెలిపి తగిన సూచనలను సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులకు అందజేయడం జరిగింది.

## చిన్నారి మోక్షితను ఆశీర్వదించిన స్వామీజీ...



**రామాయంపేట మార్చి 17 ( మన వార్త ప్రతినిధి)**రామాయంపేట మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్ కూతురు మోక్షిత నాల్గవ జన్మదినం పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం పీఠాధిపతి శ్రీ మాధవనంద సరస్వతి స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు, జన్మదినోత్సవం సందర్భంగా స్వామివారు చిన్నారి మోక్షితను ఆశీర్వదించి ప్రసాదాన్ని అందజేశారు, పిల్లలకు చిన్నప్పటినుండే భక్తి భావన పెరిగే విధంగా దేవాలయాలకు తీసుకువెళ్లాలని జన్మదినం సందర్భంగా ఆర్భాటాలకు వెళ్లి ఖర్చులు పెట్టకుండా దేవాలయాల వద్దకు వెళ్లి దైవదర్శనం చేసుకొని పేదలకు దానధర్మాలు చేయాలని పిల్లలకు చిన్నప్పటినుంచి మంచి అలవాట్లను నేర్పిస్తూ దేవాలయాలకు పెళ్లి దేవాలయల విశిష్టతను తెలియజేయాలని ఆయన సూచించారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లావణ్య నాగరాజు, వైస్ చైర్మన్ నవనీత గణేష్, కౌన్సిలర్ లు శంకర్ గౌడ్, సందీప్, రంజిత్, రవి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు

## రైతు భరోసా నిధుల దుర్వినియోగం అధికారిపై వేటు!



**నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం (మన వార్త) మార్చ్ 17** తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం "రైతు భరోసా" నిధుల వ్యవహారంలో నిర్లక్ష్యం, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఓ అధికారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. సంబంధిత అధికారిని విధుల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.రైతు భరోసా పథకం కింద రైతులకు అందాల్సిన సుమారు రూ.6,000 చొప్పున ఆర్థిక సహాయం పంపిణీలో లోపాలు, ఆలస్యం జరిగినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో అధికారులు పరిశీలన జరిపి బాధ్యుడిపై చర్యలు చేపట్టారు.ఈ మేరకు 28-02-2026 వరకు అధికారిని విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం 25-03-2026 నుంచి తిరిగి విధుల్లో చేరాలని సూచించారు. అదేవిధంగా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ ఘటన రైతుల్లో చర్చనీయాంశంగా మారింది.

## సిరికొండలో తైబజార్ వేలం ఘనంగా రూ.6.03 లక్షలకు కర్కా భూమన్నకు దక్కిన హక్కులు



**నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం (మన వార్త) మార్చ్ 17**సిరికొండ మండల కేంద్రంలో మంగళవారం తైబజార్ వేలం కార్యక్రమం సర్పంచ్ మల్లెల సాయి చరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ వేలంలో కర్కా భూమన్న రూ.6 లక్షల 3 వేల 200 రూపాయలతో అత్యధిక బిడ్ వేయడంతో తైబజార్ హక్కులను దక్కించుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మల్లెల సాయి చరణ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు, వ్యాపారస్తులు తైబజార్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పారదర్శకంగా వేలం నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శంకర్, నర్సయ్య, ఎణజ చైర్మన్ స్వామి, వైస్ చైర్మన్ రామస్వామి గౌడ్, కార్యదర్శి వినిల్, కరబార్ ప్రవీణ్, గ్రామ పెద్దలు దిగంబర్, బాలయ్య, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

## 2027 జనభా గణన- సెన్సెస్ చార్జి అధికారుల శిక్షణ ముగింపు...



**-జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 17** జనాభా గణన-2027 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు,చార్జ్ అధికారులు,మార్గ దర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు. మంగళవారం చివరి రోజు జనాభా గణన￼సెన్సెస్ 2027కు సంబంధించి చార్జి అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని రెండు దశల్లో నిర్వహించే గణనను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. హౌస్ లిస్టింగ్ ను కచ్చితంగా చేసినట్లయితే సెన్సెస్ పూర్తి అయినట్లే అని అన్నారు. బ్లాక్ ల వారీగా ఏర్పాటు చేసుకొని సుల భతరంలో సెన్సెస్ చేయా లన్నారు. ప్రతి దశను క్షేత్ర స్థాయిలో , పారదర్శకంగా సెన్సెస్ నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జనాభా గణన సెన్సెస్-2027 ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ , సమగ్ర సమాచారం సేకరణపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. డిజిటల్ విధానంలో జరగ నున్న ఈ ప్రక్రియలో ప్రతి ఇంటిని , ప్రతి వ్యక్తిని చేర్చడంతో వారి వివరాలను తప్పకుండా నమోదు చేయాలన్నారు. అలాగే , ప్రజల సహకారం కూడా అత్యంత కీలకమని , అవగాహన కార్యక్రమాలు నిర్వహించి జనాభా గణనకు ప్రజలను చురుకుగా భాగ స్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి , జిల్లా గణాంక అధికారి వెంకటరమణ , మున్సిపల్ కమిషనర్లు , తాసిల్దార్లు , ఎంపీడీవోలు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి...



**-అధికారులపై మండిపడ్డ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు...**

**రామాయంపేట మార్చి 17 ( మన వార్త ప్రతినిధి)**కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ప్రధాని మోడీ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫోటోలు ఫ్లెక్సీ పై లేకపోవడం చాలా బాధాకరమని ఈ విషయంలో భారతీయ జనతా పార్టీ ఖండిస్తుందన్నారు గతంలో కూడా ఈ ప్రోటోకాల్ విషయంలో కలెక్టర్ కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ దానిపైన ఇప్పటివరకు కూడా చర్యలు చేపట్టక పోగా మంగళవారం మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో నిర్వహించిన సిహెచ్ హెల్త్ సెంటర్లో ప్రారంభించిన హెచ్ పి వి కార్యక్రమంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న హెచ్పివి వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం సంబంధించిన ఫ్లెక్సీలో ప్రధానమంత్రి ఫోటో లేకపోవడం స్థానిక ఎంపీ ఫోటో లేకపోవడం శోచనీయం బాధాకరమన్నారు, అధికార యంత్రాంగానికి గతంలో అనేకసార్లు కూడా ఈ ప్రోటోకాల్ విషయంలో ఫిర్యాదులు చేసిన కనీసం అవగాహన లేకుండా వ్యవహరించడాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు ఖండించారు, ఈ ప్రోటో కాల్ విషయంలో ఎంపీ రఘునందన్ రావుకు సమాచారం కూడా ఇవ్వకపోవడాన్ని బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు, ఈ విషయంలో కలెక్టర్ కల్పించుకొని ఇటువంటి తప్పిదాలు జరగకుండా అధికార యంత్రాంగాన్ని అధికారులను ఆదేశించాలని వారు కోరారు, తప్పు చేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, అనవసరంగా భారతీయ జనతా పార్టీ నాయకుల, కార్యకర్తల సహనాన్ని పరీక్షించినట్టయితే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని . ఎంపీ కి సమాచారం లేని ప్రోటో కాల్ పాటించని, కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామని వారు తెలిపారు, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన ఫోటోగ్రాఫర్స్...



**శంకరపట్నం:మార్చి17(మనవార్త ప్రతినిధి)**అనారోగ్యంతో బాధపడుతున్న ఫోటో గ్రాఫర్ కు తోటి ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేసి ఉదారత చాటుకున్నారు.శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన అజీమ్ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు.విషయం తెలుసుకున్న తోటి ఫోటో & వీడియో గ్రాఫర్ సభ్యులు రూ.21 వేల నగదును మంగళవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి,కరీంనగర్ టౌన్ ప్రధాన కార్యదర్శి సాయి ప్రీతి రమేష్,శంకరపట్నం మండల అధ్యక్షుడు చౌడమల్ల సంపత్,ప్రధాన కార్యదర్శి బొంగోని కుమార్,ఉపాధ్యక్షులు గోరే మియా,మనోచారి సభ్యులు పాంద్రాల శ్రీనివాస్,వంగ శ్రీనివాస్,బొజ్జ చంద్రమౌళి,సుద్దాల కుమార్,జినుక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన పై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 17** జిల్లాలో డ్రగ్స్ మత్తు పదార్థాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. మంగళవారం రోజు మినీ మీటింగ్ హాలులో ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ , చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి , వైద్య ఆరోగ్యశాఖ , జిల్లా విద్యా , తదితర సంబంధిత విభాగాలతో కలిసి డ్రగ్స్ నిర్మూలన పై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్ , మత్తు పదార్థాల వినియోగం పై జరిగే దుష్ పరిణామాలపై ప్రజల ప్రచారం చేయాలని అన్నారు. చదువు మధ్యలో మానేసిన విద్యార్థులపై నిగా పెట్టాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణా సరఫరా చేసిన వారిని గుర్తించి పోలీస్ శాఖ ద్వారా 7 కేసులు , ఎక్సైజ్ శాఖ ద్వారా 3 గంజాయి కేసు మొత్తం (8) కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో జిల్లాలో డ్రగ్స్ , గుడుంబా , మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ కాలేజీ , ఫ్యాక్టరీ , గ్రామాలలో డ్రగ్స్ పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. యువత డ్రగ్స్ కి అలవాటు పడకుండా చూడాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి మనోహర్ , జిల్లా విద్యాశాఖ అధికారి సత్య నారాయణ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గోదాముల పెంచేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం...

**-జిల్లా కోపరేటివ్ డెవలప్మెంట్ కమిటీలో ఆమోద ముద్ర...**

**-జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 17** యాదాద్రి భువనగిరి జిల్లాలో గోదాముల సదుపాయాన్ని పెంచేందుకు జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఈ మేరకు స్థానిక సంస్థల



అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు ఆధ్వర్యంలోని జిల్లా కోపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో ఆమోద ముద్ర వేయడం జరిగింది. జిల్లాలో గోదాముల సదుపాయం సరిపడినంత లేనందున భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గోదాములను నిర్మించ నున్నారు. వరల్డ్ లార్జెస్ట్ గ్రీన్ స్టోరేజ్ స్కీమ్ ద్వారా సహకార సంఘములకు ఈ గోదాములను నిర్మించ నున్నారు. దీని కొరకు నాబార్డు నుండి ఆర్థిక సహాయం లభించనుంది. జిల్లాలో రైలు , రోడ్డు మార్గాలకు దగ్గరగా ఉండి గోదాముల నిర్మాణానికి అనువైన భూమిని కలిగి ఉన్న మూడు సహకార సంఘాలలో వీటిని నిర్మించనున్నారు. వీటి ద్వారా దాదాపుగా 40 వేల మెట్రిక్ టన్నుల గోదాముల సౌకర్యం జిల్లాలో అందు బాటులోకి రానున్నది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తక్కువ ధరలలో మందులు దొరికేశీదుకు పిఏసిఎస్ లలో జన ఔషధీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారని డిసిఓ మురళి రమణ తెలిపారు.

## వేములవాడలో మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు...



**వేములవాడ మార్చి 17 (మన వార్త )**ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వర ఆలయంలో స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి వేములవాడ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బద్ది పోచమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఎడ్ల శివసాయి, వేద పండితులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి



**ఇల్లంతకుంట, మార్చి 17 (మన వార్త )**ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండలం వంతడుపుల, అనంతారం, రేపాక, ఓబులాపూర్, బోయినపల్లి మండలం విలాసాగర్, మల్కాపూర్, మర్లపేట, కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్, వేములవాడ, గంభీరావుపేట మండలం శ్రీగాద గ్రామాల్లో మొత్తం 40 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కల మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇల్లంతకుంట మండలం వంతడుపులలో మంగళవారం కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి, లాభాలు వస్తాయని తెలిపారు. ఆయిల్ పామ్ లో అంతర పంటలుగా కూరగాయలు, మొక్క జొన్న, పూల మొక్కలు ఇతర పంటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్, ఇతర సబ్సిడీలు ఉన్నాయని తెలిపారు. పంటకు మంచి మద్దతు ధర వస్తుందని వివరించారు. పంట ఉత్పత్తి సేకరణకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి మండలం నుంచి కొనుగోలు చేస్తారని తెలిపారు. ఒకే పంట సాగు చేయకూడదనే ఉద్దేశంతో, ఆయిల్ పామ్ సాగు పెంచేందుకు ఇప్పటికే పీఏసీఎస్ లలో రైతులకు అవగాహన కల్పించామని, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు లక్ష్యం నిర్దేశించామని తెలిపారు. ఆదర్శనీయమైన రైతులు ముందుకు వస్తున్నారని, మిగతా వారు కూడా సాగు చేయాలని పిలుపు ఇచ్చారు. జిల్లాకు దగ్గరలోనే సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఈ నెల 22 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించ నున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు ఉన్నారు.

## గ్రామ సమాఖ్య భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

**-కలెక్టర్ గరిమ అగ్రవాల్...**

**-ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటలో భవన నిర్మాణ పనులు పరిశీలన...**

**ఇల్లంతకుంట, మార్చి -17**(గ్రామ సమాఖ్య భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం



ముస్కానిపేట గ్రామంలో గ్రామ సమాఖ్య భవన నిర్మాణ పనులను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులు ఎప్పుడు మొదలు పెట్టారో ఆరా తీశారు. కావలసిన కార్మికులు, సామాగ్రి సిద్ధం చేసుకోవాలని, భవన నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. మండలంలో మంజూరు అయిన అంగన్వాడీ కేంద్రాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. టాయిలెట్ల నిర్మాణాలు సైతం నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. జన గణనలో భాగంగా ఇండ్ల గణనకు చేస్తున్న ప్రక్రియపై ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు ఉన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత..



**శంకరపట్నం:మార్చి17(మనవార్త ప్రతినిధి)**పోయిన సెల్ ఫోన్ ను వెతికి పట్టుకొని పోలీసులు మంగళవారం బాధితురాలికి అప్పగించారు.శంకరపట్నం మండలం మెట్పల్లి గ్రామానికి చెందిన ఈరబోయిన గంగవ్వ భర్త శ్రీనివాస్ తన సెల్ఫోన్ పోయిందని కేశపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది.దీంతో పోలీసులు ఫిర్యాదురాలు దగ్గర నుండి ఐఎంఈఐ నెంబర్ తీసుకుని సీఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేసి పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను ట్రాక్ చేసి పట్టుకున్నారు.అనంతరం బాధితురాలికి మంగళవారం అప్పగించారు.ఎవరైనా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న పక్షంలో వెంటనే వాటి వివరాలు సీఈఐఆర్ పోర్టల్ లో అప్లోడ్ చేసుకోవాలని,తద్వారా మొబైల్ గుర్తించబడి తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందని కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేయాలి



**వేములవాడ, మార్చి, 17 (మన వార్త )**ప్రజల సహకారంతోనే పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం సాధ్యమవుతుందని, పట్టణాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను తప్పనిసరిగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేములవాడ మండలం తెట్టెకుంట శివారులో వేములవాడ మున్సిపాలిటీకి సంబంధించిన పొడి వనరుల సేకరణ కేంద్రంలో నూతనంగా సమకూర్చిన యంత్రాలను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6వ తేదీ నుంచి మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణాల్లో చెత్త సేకరణ, చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా చేసేందుకు పలు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.వేములవాడ మున్సిపాలిటీకి సంబంధించి ఇప్పటికే పొడి వనరుల సేకరణ కేంద్రం ఉండగా, ఇప్పుడు ఆ కేంద్రంలో ఏజెన్సీ ద్వారా నూతనంగా సమకూర్చిన యంత్రాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడానికి ఈ యంత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.మున్సిపాలిటీ వాహనాల ద్వారా ఇంటింటికీ తిరిగి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సేకరిస్తున్నామని తెలిపారు. సేకరించిన పొడి చెత్తను ఈ కేంద్రానికి తీసుకువచ్చి యంత్రాల సహాయంతో ప్రాసెస్ చేసి కంపోస్ట్ తయారు చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల చెత్త నిర్వహణ సక్రమంగా జరిగి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించారు.ప్రజలు తమ ఇళ్లలోనే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వాహనాల్లో కూడా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు కంపార్ట్మెంట్లలో సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెత్తను వేరు చేయడం వల్ల రీసైక్లింగ్ ప్రక్రియ సులభమవుతుందని, తడి చెత్త, పొడి చెత్త కలిసిపోవడం వల్ల డంపింగ్ యార్డుల్లో సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చని తెలిపారు.ఈ డీఆర్సీసీ కేంద్రంలో ఒక బేలింగ్ మెషిన్, ఒక వెయిమెంట్ మెషిన్ ఏర్పాటు చేయగా, ఈ కేంద్రం 15 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేస్తుందని తెలిపారు. అలాగే కంపోస్ట్ కేంద్రం కూడా 15 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేయబడిందని పేర్కొన్నారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు కొక్కుల బాలకృష్ణ, అన్నారం శ్రీనివాస్, తూమ్ మధు, ఎల్ల శ్రీనివాస్, తోట రాజు, కాషా శ్రీనివాస్, మూడపల్లి నీలమ్మ,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సమావేశాలలో ఉద్యమకారుల హామీల కార్యాచరణ ప్రకటించాలి




**– కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి...**

**వేములవాడ మార్చి 17 (మన వార్త )**మంగళవారం తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం ప్రధాన కార్యాలయం వేములవాడ నందు జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం టి యు ఎఫ్ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వి యెల్ల పోశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ అనుమతితో తెలియజేస్తూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ఇప్పుడు జరగనున్న అసెంబ్లీ సమావేశాలలో తీర్మానం చేయాలి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ. రేవంత్ రెడ్డి కి సంబంధిత మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ కి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి సహచర మంత్రులు అసెంబ్లీ సమావేశాలలో తీర్మానం చేసి కార్యాచరణ ప్రకటించాలనీ కోరుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు కవులు రచయితలు కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ కోఆర్డినేటర్ బొడ్డు రాములు వెన్నమల్ల వెంకటేష్ పాల్గొన్నారు

## వేములవాడలో భక్తుల రద్దీ బద్దిపోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు...



**వేములవాడ మార్చి 17 (మన వార్త )**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయాలైన శ్రీ భీమేశ్వర స్వామి మరియు శ్రీ బద్దిపోచమ్మ ఆలయాలను సోమవారం భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించడం, కల్లు బెల్లం శాఖ పట్నాలు వేయడం ఇక్కడ ఆనవాయితీగా కొనసాగుతోంది.భక్తులు అమ్మవారిని దర్శించుకుని వివిధ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆలయాలకు భారీగా భక్తులు తరలివస్తున్నారు.వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.అలాగే కూల్ వాటర్ బబుల్స్ ద్వారా తాగునీరు అందుబాటులో ఉంచి భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పిస్తున్నారు.

## వేములవాడలో శ్రీరామనవమి వేడుకలకు శ్రీకారం పోస్టర్ల విడుదల...



**వేములవాడ మార్చి 17 (మన వార్త )**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.శ్రీరామనవమి సందర్భంగా మార్చి 27, 2025 శుక్రవారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.అలాగే ఉగాది పండుగ సందర్భంగా మార్చి 19, 2026 గురువారం సాయంత్రం 4.30ని.లకు పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమాల ప్రచారార్థం జిల్లా వ్యాప్తంగా పోస్టర్ల పంపిణీ చేపట్టారు. ఇందులో భాగంగా మొదటి వాల్ పోస్టర్ను ఆలయ ప్రాంగణంలోని ప్రోటోకాల్ కార్యాలయంలో పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు నరాల రాజు, సింహాచారి తదితర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో మాస శివరాత్రి ప్రత్యేక పూజలు...



**వేములవాడ మార్చి 17 (మన వార్త )**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా ఉదయం శ్రీ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పరివార దేవతల అర్చనలు నిర్వహించబడ్డాయి.సాయంత్రం మహా లింగార్చన కార్యక్రమంలో భాగంగా 365 జ్యోతులను వెలిగించారు. ఈ కార్యక్రమాన్ని రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు ఏకాంతంగా నిర్వహించారు.

## గ్రామపంచాయతీ కార్మికులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు



**ఎల్లారెడ్డిపేట మార్చి 17 : (మన వార్తా ప్రతినిధి)**గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన ధర్నా లో పాల్గొనకుండా గ్రామపంచాయతీ కార్మికులను ఎల్లారెడ్డి పేట పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో పలు గ్రామపంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఇందిరా పార్కులో కార్మికుల సమస్యలు, పెండింగ్ జీతాలు, డ్యూటీ రెగ్యులరైజేషన్, గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికులకు జీతాలు చెల్లించాలన్న డిమాండ్లతో పాటు పలు సమస్యల మంగళ వారం ధర్నా నిర్వహిస్తుండగా అట్టి ధర్నాకు వెళ్లకుండా కారోబార్ లు జక్కుల మహేందర్, శ్రీ పేరంబూధర్ శ్రీనివాస్, వాటర్ మ్యాన్ నారాపురం నర్సయ్య ను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్కు తరలించారు.

## నేడు కోరపల్లి గ్రామంలో గల షాపింగ్ కాంప్లెక్స్ బహిరంగ వేలం..




**జమ్మికుంట, మార్చి 17( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో గల షాపింగ్ కాంప్లెక్స్ బహిరంగ వేలం బుధవారం జరగనున్నట్లు గ్రామ కార్యదర్శి తారక రామ్, సర్పంచ్ మధుసూదన్ తెలిపారు.జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో గల షాపింగ్ కాంప్లెక్స్2026-27 సంవత్సరానికి గాను బహిరంగ వేలం మండల పరిషత్ అధికారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొని వారు చిన్న షటర్కు రూ.5000 రూపాయలు పెద్ద షెటర్ కు రూ.10000 రూపాయలను డిపాజిట్ చేయాలని, ఆ డిపాజిట్ చేసిన డబ్బులు తిరిగి ఇవ్వడం జరగదని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం వరకు డిపాజిట్ డబ్బులు చెల్లించిన వారు వేలం పాటలో పాల్గొంటారని కార్యదర్శి తారక్ పేర్కొన్నారు. బహిరంగ వేలం కోరపల్లి గ్రామపంచాయతీ ఎదుట బుధవారం రోజున నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ పేర్కొన్నారు.

## మిషన్ భగీరథ పైపు లీకేజి నీరు వృథా..



**జమ్మికుంట, మార్చి 17( మన వార్త ప్రతినిధి):**మిషన్ భగీరథ పైపు లీకేజి అయి నీరు వృథాగా అవుతుంది.పట్టణంలోని బస్టాండ్ ముందు మీసెన్ భగీరథ ప్రధాన పైపు లీకై నీరు వృథా అవుతుంది.ప్రధాన రోడ్డు పక్కన వరద పారుతుంది.ప్రయాణికులు,బాటసారులు, ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే అవకాశం కావున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.తరచూ ఇదే ప్రదేశంలో పైపు లీకవుతుందని,తాత్కాలికంగా మరమత్తులు చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు,ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తరచూ పైపు లీకై నీరు వృథా కాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని అధికారులను కోరుతున్నారు.


## రికార్డు స్థాయిలో అంగండి వేలం...



**-రూపాయలు 55.35లక్షలు...**

**జమ్మికుంట, మార్చి 17( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మెన్ మొలుగు ప్రశాంత్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ అంగడి వేలం పాట 55లక్షల 35వేలకు పరకాల గ్రామానికి చెందిన పోరండ్ల రవేష్ దక్కించుకున్నాడు. గతంలో (2025-26) 40లక్షల 61వేలకు ఇదే పోరండ్ల రమేష్ దక్కించుకోగా, మంగళవారం నిర్వహించిన వేలం పాటలో పోటాపోటీగా వేలం పాట పాడి పోరండ్ల రమేష్ రూ 55లక్షల 35వేలకు దక్కించుకున్నట్లు మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, ఆర్ ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కిస్మిస్ ఆరోగ్య ప్రయోజనాలు



**డెస్క్,** కిస్మిస్ అనేది ద్రాక్ష పండ్లను ఎండబెట్టి తయారు చేసే సహజ ఆహారం. చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ ఇందులో అనేక పోషకాలు ఉంటాయి. శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు అందించడంలో కిస్మిస్ కీలక పాత్ర పోషిస్తుంది. రోజూ తగిన పరిమాణంలో కిస్మిస్ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి పలు ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. కిస్మిస్‌లో సహజంగా శక్తినిచ్చే పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అలసటగా అనిపించినప్పుడు కొద్దిగా కిస్మిస్ తింటే శరీరానికి వెంటనే శక్తి అందుతుంది. ఇందులో ఉండే ఐరన్ పదార్థం రక్తహీనత సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా మహిళలు మరియు పిల్లలకు కిస్మిస్ ఉపయోగకరమైన ఆహారంగా భావిస్తారు. జీర్ణక్రియ సరిగా లేకపోవడం, మలబద్ధకం వంటి సమస్యలు ఉన్నవారికి కూడా కిస్మిస్ మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రాత్రి సమయంలో కొద్దిగా కిస్మిస్‌ను నీటిలో నానబెట్టి ఉదయం తింటే జీర్ణక్రియ మెరుగుపడే అవకాశం ఉంటుంది. అలాగే కడుపు సమస్యలు తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది. అలాగే కిస్మిస్‌లో ఉండే సహజ యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ఎముకల బలాన్ని పెంచడంలో, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా కిస్మిస్ పాత్ర ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే రోజువారీ ఆహారంలో తగిన పరిమాణంలో కిస్మిస్ చేర్చుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## పాలిచ్చే తల్లులకు మునగాకు మేలు...



**డెస్క్,** ప్రసవం తర్వాత పాలిచ్చే తల్లులు తీసుకునే ఆహారం తల్లి ఆరోగ్యానికే కాకుండా శిశువు ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. ఈ సమయంలో పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరం. అలాంటి ఆహారాల్లో మునగాకు ముఖ్యమైనదిగా భావిస్తారు. మునగాకులో అనేక పోషకాలు ఉండటంతో పాలిచ్చే తల్లులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మునగాకులో కాల్షియం, ఐరన్, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి తల్లి శరీరానికి బలం అందించడంతో పాటు ప్రసవం తర్వాత వచ్చే బలహీనతను తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా పాలిచ్చే తల్లుల్లో పాల ఉత్పత్తి పెరగడంలో మునగాకు ఉపయోగపడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మునగాకును పప్పుగా లేదా కూరగా వండుకుని తినడం ఆరోగ్యానికి మంచిదిగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రసవం తర్వాత తల్లులకు మునగాకు వంటలు చేయడం ఒక సంప్రదాయంగా ఉంది. ఇది తల్లి శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో సహాయపడుతుంది. అందుకే పాలిచ్చే తల్లులు తమ రోజువారీ ఆహారంలో మునగాకును చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సరైన పరిమాణంలో మునగాకు తీసుకోవడం వల్ల తల్లి ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు శిశువుకు అవసరమైన పోషకాలు పాలు ద్వారా అందే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు.

## వేసవిలో చల్లని నీరు తాగడం మంచిదేనా?



**డెస్క్,** వేసవికాలంలో ఎండ తీవ్రంగా ఉండటంతో చాలా మంది దాహం తీర్చుకోవడానికి చల్లని నీటిని తాగడం అలవాటు చేసుకుంటారు. బయట నుంచి ఇంటికి వచ్చిన వెంటనే ఫ్రిజ్‌లో ఉన్న చల్లని నీరు తాగితే తక్షణ ఉపశమనం కలిగినట్టు అనిపిస్తుంది. అయితే అధికంగా చల్లని నీరు తాగడం శరీరానికి పూర్తిగా మంచిది కాదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అత్యంత చల్లని నీరు తాగడం వల్ల జీర్ణక్రియపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇది కడుపులో ఉన్న జీర్ణరసాల పనితీరును కొంతమేర తగ్గించవచ్చు. దీంతో అజీర్తి, కడుపు అసౌకర్యం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఎండలో ఎక్కువసేపు ఉండి వెంటనే చాలా చల్లని నీరు తాగితే గొంతు సమస్యలు లేదా జలుబు వచ్చే అవకాశం ఉంటుంది. శరీరం ఒక్కసారిగా ఉష్ణోగ్రత మార్పుకు గురవడం వల్ల అలాంటి సమస్యలు ఎదురయ్యే అవకాశముందని నిపుణులు సూచిస్తున్నారు. అందుకే వేసవిలో నీరు తాగేటప్పుడు మితంగా తాగడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఫ్రిజ్‌లో ఉన్న చాలా చల్లని నీటి కంటే సహజంగా చల్లగా ఉన్న నీరు తాగడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో దాహం తీరడంతో పాటు శరీర ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చు.

## ఏప్రిల్ 1 నుంచి కొత్త క్రెడిట్ కార్డు నిబంధనలు వినియోగదారులకు హెచ్చరిక



**హైదరాబాద్,** క్రెడిట్ కార్డులు ఉపయోగించే వారికి కీలక హెచ్చరిక వెలువడింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న ఏప్రిల్ 1వ తేదీ నుంచి పలు బ్యాంకులు తమ క్రెడిట్ కార్డు నిబంధనల్లో మార్పులు తీసుకురానున్నాయి. క్యాష్‌బ్యాక్, రివార్డ్ పాయింట్లు, లావాదేవీ ఛార్జీల్లో ఈ మార్పులు ప్రభావం చూపనున్నాయి.ప్రధానంగా ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, యెస్ బ్యాంక్ తమ నిబంధనలను సవరించాయి. ఎయిర్‌టెల్ యాక్సిస్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు ఏప్రిల్ 12 నుంచి కొన్ని సేవలు నిలిచిపోనున్నాయి. ముఖ్యంగా జొమాటో, స్విగ్గీ, బిగ్ బాస్కెట్ వంటి ప్లాట్‌ఫామ్‌లపై ఇప్పటి వరకు లభించిన 10 శాతం క్యాష్‌బ్యాక్ నిలిపివేయనున్నారు. దాని బదులుగా ఇతర యాప్‌లలో కొత్త రకాల ఆఫర్లు ప్రవేశపెట్టనున్నారు.యాక్సిస్ బ్యాంక్ ప్రకారం ప్రతి బిల్లింగ్ సైకిల్‌కు గరిష్ట క్యాష్‌బ్యాక్ పరిమితిని నిర్దేశించారు. ఇక యెస్ బ్యాంక్ గ్యాస్, నీరు, విద్యుత్ బిల్లుల చెల్లింపులపై పరిమితులు విధించనుంది. నిర్ణయించిన పరిమితి దాటితే ఒక శాతం అదనపు ఛార్జీ వసూలు చేయనున్నారు. టోల్, బ్రిడ్జ్ చెల్లింపులపైనా ఇదే విధమైన ఛార్జీలు అమలు కానున్నాయి.ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై కూడా కొత్త నియమాలు అమల్లోకి రానున్నాయి. నెలకు గరిష్టంగా అరవై వేల రివార్డ్ పాయింట్లను మాత్రమే స్టేట్‌మెంట్ క్రెడిట్‌గా మార్చుకునే అవకాశం ఉంటుంది. అలాగే నాలుగు వేల పాయింట్ల గుణితాల్లోనే రివార్డ్ పాయింట్ల వినియోగం చేయాల్సి ఉంటుంది. కొన్ని ప్రత్యేక కార్డులకు మాత్రం ఈ నిబంధనలు వర్తించవు.ఈ మార్పులపై వినియోగదారులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. లేకపోతే అనవసరంగా అదనపు ఛార్జీలు చెల్లించాల్సి రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఉద్యోగులకు శుభవార్త ఈపీఎఫ్‌వో 3.0తో డబ్బు విత్‌డ్రా వేగవంతం




**న్యూఢిల్లీ,** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ప్రవేశపెట్టిన ఈపీఎఫ్‌వో 3.0 వ్యవస్థతో ఉద్యోగులకు భారీ ఊరట లభించింది. ఈ కొత్త డిజిటల్ సంస్కరణతో క్లెయిమ్ ప్రక్రియలు సులభతరమవడంతో పాటు డబ్బు ఉపసంహరణ వేగంగా జరుగుతోంది.ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, క్లెయిమ్ సెటిల్‌మెంట్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో ఒక క్లెయిమ్‌ను పరిష్కరించడానికి సుమారు 20 రోజుల వరకు పట్టేది. అయితే ఇప్పుడు అదే ప్రక్రియ మూడు రోజుల్లోపే పూర్తవుతోంది.కేంద్రీకృత పింఛను చెల్లింపు వ్యవస్థను పూర్తిగా అమలు చేయడంతో ప్రతి నెలా లక్షలాది పింఛనుదారులకు సమయానికి, తప్పుల్లేకుండా చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ వ్యవస్థ వల్ల సేవలు మరింత పారదర్శకంగా మారాయి.క్లెయిమ్‌ల పరిష్కారంలో కూడా ఆటోమేటిక్ విధానం ప్రవేశపెట్టారు. ఐదు లక్షల రూపాయల వరకు ఉన్న లక్షలాది క్లెయిమ్‌లు స్వయంచాలకంగా పరిష్కరించబడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ శాతం అడ్వాన్స్ క్లెయిమ్‌లు మాన్యువల్ జోక్యం లేకుండానే ప్రాసెస్ చేయడం విశేషం.ఉద్యోగాలు మారే సమయంలో పీఎఫ్ ఖాతా బదిలీ ప్రక్రియ కూడా సులభమైంది. కేవలం ఒకసారి వివరాల ధృవీకరణ పూర్తయిన తర్వాత యజమాని ఆమోదం అవసరం లేకుండానే ఖాతా బదిలీ అవుతోంది. దీనివల్ల ఉద్యోగులకు సమయం, శ్రమ రెండూ ఆదా అవుతున్నాయి.ఈపీఎఫ్‌వో 3.0 ద్వారా అన్ని సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం వల్ల కాగితపు పని తగ్గి, సేవలు వేగంగా అందుతున్నాయి. దీంతో ఉద్యోగులకు మరింత సౌకర్యం కలుగుతోందని అధికారులు తెలిపారు.

## ఎలక్ట్రిక్ స్కూటర్లపై భారీ తగ్గింపు 123 కి.మీ ప్రయాణ సామర్థ్యం




**హైదరాబాద్,**ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయాలనుకునే వారికి మంచి అవకాశం లభించింది. ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ తన ప్రాచుర్యం పొందిన రిజ్టా ఎస్, 450ఎస్ స్కూటర్లపై ఆకర్షణీయమైన తగ్గింపు ఆఫర్లను ప్రకటించింది.ఈ ఆఫర్ల ద్వారా వినియోగదారులు గరిష్టంగా ఇరవై వేల రూపాయల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది. ఈ రాయితీలు మార్చి 31 వరకు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంటాయి.డిస్కౌంట్ ప్యాకేజీలో పది వేల రూపాయల కార్డు తగ్గింపు, ఆరు వేల ఐదు వందల రూపాయల నగదు తగ్గింపు, మూడు వేల ఐదు వందల రూపాయల విలువైన అదనపు వారంటీ ఉన్నాయి. ఈ రాయితీలతో రిజ్టా ఎస్ ప్రారంభ ధర సుమారు ఒక లక్ష నాలుగు వేల ఏడు వందల యాభై ఎనిమిది రూపాయలకు తగ్గింది.రిజ్టా ఎస్ స్కూటర్ కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది. సీటు కింద పెద్ద నిల్వ స్థలం ఉండటం, 123 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం ఉండటం దీని ప్రధాన ఆకర్షణలు. ఇందులో 2.9 కిలోవాట్ గంటల బ్యాటరీ ఉండి గంటకు 80 కిలోమీటర్ల వేగాన్ని అందిస్తుంది.ఇక 450ఎస్ స్కూటర్ పట్టణ ప్రాంతాల్లో ప్రయాణించే వారికి అనుకూలంగా ఉంటుంది. ఇది సుమారు 115 కిలోమీటర్ల ప్రయాణ సామర్థ్యంతో శక్తివంతమైన మోటార్‌తో వస్తుంది.ఈ స్కూటర్లకు ఎనిమిది సంవత్సరాల బ్యాటరీ వారంటీ ఇవ్వడం వినియోగదారులకు మరింత నమ్మకాన్ని కలిగిస్తోంది. అదనంగా ప్రభుత్వ సబ్సిడీ ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉండటంతో ఖర్చు మరింత తగ్గుతుంది.పరిమిత కాలం మాత్రమే ఈ ఆఫర్లు అందుబాటులో ఉండటంతో, ఎలక్ట్రిక్ స్కూటర్ కొనుగోలు చేయాలనుకునే వారు త్వరగా నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## బంగారం, డాలర్ కాదు ఇప్పుడు బిట్‌కాయిన్ హవా



**హైదరాబాద్,** ప్రపంచంలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల మధ్య పెట్టుబడిదారుల దృష్టి కొత్త దిశగా మళ్లుతోంది. సాధారణంగా సంక్షోభ సమయంలో బంగారం, డాలర్ వైపు మొగ్గు చూపే ఇన్వెస్టర్లు ఇప్పుడు బిట్‌కాయిన్ వైపు అడుగులు వేస్తున్నారు.ఇరాన్‌లో ప్రారంభమైన యుద్ధ ప్రభావంతో ప్రపంచ మార్కెట్లు అతలాకుతలం అవుతున్నాయి. చమురు సరఫరాలో అంతరాయం, స్టాక్ మార్కెట్లలో పడిపోతున్న సూచీలు పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయితే ఈ పరిస్థితుల్లో బిట్‌కాయిన్ మాత్రం అనూహ్యంగా బలంగా నిలుస్తోంది. ఫిబ్రవరి చివరి నుంచి ఇప్పటి వరకు దాని విలువ దాదాపు పది శాతం పెరిగి 72 వేల డాలర్ల స్థాయిని దాటింది.సంక్షోభ సమయంలో బ్యాంకింగ్ వ్యవస్థలు దెబ్బతినే అవకాశం ఉండటంతో పాటు ప్రభుత్వ నియంత్రణలు పెరగవచ్చు. కానీ బిట్‌కాయిన్‌కు అలాంటి పరిమితులు లేకపోవడం, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడి నుండైనా తక్షణమే బదిలీ చేయగలగడం దీని ప్రధాన బలం. అందుకే పెట్టుబడిదారులు దీనిని కొత్త తరహా భద్రమైన ఆస్తిగా పరిగణించడం ప్రారంభించారు.ఇక బంగారం ధరలు మాత్రం పెద్దగా పెరగకుండా స్థిరంగా ఉన్నాయి. అమెరికా డాలర్ బలపడటం, వడ్డీ రేట్లపై అనిశ్చితి కొనసాగడం బంగారంపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఈసారి బంగారం కంటే బిట్‌కాయిన్‌పై ఆసక్తి పెరిగింది.మరోవైపు క్రిప్టో నిధుల్లో భారీగా పెట్టుబడులు చేరుతున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో, సులభంగా బదిలీ చేయగల, ప్రభుత్వాల నియంత్రణ తక్కువగా ఉండే బిట్‌కాయిన్‌ను భవిష్యత్తు డిజిటల్ బంగారంగా మార్కెట్ నిపుణులు అభివర్ణిస్తున్నారు.

## మాస్ ఇమేజ్‌పై ఫోకస్ శేఖర్ కమ్ముల కథకు నో చెప్పిన నాని?



**హైదరాబాద్,**టాలీవుడ్‌లో సహజ నటుడిగా గుర్తింపు పొందిన నాని తన కెరీర్‌ను కొత్త దిశగా మలుచుకునే ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇండస్ట్రీలో అగ్రశ్రేణి హీరోగా నిలవాలనే లక్ష్యంతో ప్రస్తుతం మాస్ కథలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు క్లాస్ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నాని, ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించే మాస్ మసాలా చిత్రాలను ఎంచుకుంటున్నాడని సమాచారం. ఈ నేపథ్యంలో ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల చెప్పిన కథను నాని తిరస్కరించినట్లు ప్రచారం జరుగుతోంది. సున్నితమైన భావోద్వేగాలతో కూడిన కథలకు ప్రసిద్ధి చెందిన శేఖర్ కమ్ముల, నానిని దృష్టిలో పెట్టుకుని ఒక ప్రత్యేక కథను సిద్ధం చేసినప్పటికీ, ప్రస్తుతం తాను మాస్ ఇమేజ్‌ను బలోపేతం చేసుకోవాలనే దిశగా ముందుకు సాగుతున్నానని నాని తెలిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో క్లాస్ కథలకు వెళ్లడం కష్టం అని సున్నితంగా ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించినట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో కూడా నాగచైతన్య హీరోగా తెరకెక్కిన 'లవ్ స్టోరీ' చిత్రానికి ముందుగా నానినే ఎంపిక చేయాలని శేఖర్ కమ్ముల భావించినప్పటికీ, అప్పట్లో కూడా నాని ఆసక్తి చూపలేదని సమాచారం. దీంతో ఆ అవకాశం నాగచైతన్యకు వెళ్లింది. ఈ విధంగా వరుసగా ప్రాజెక్టులు నాని వద్ద నుంచి తిరస్కరణకు గురవడంతో శేఖర్ కమ్ముల కొంత నిరాశకు గురైనట్లు ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా, శేఖర్ కమ్ముల ప్రస్తుతం తన తదుపరి చిత్రం 'హ్యాపీడేస్ 2' పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కథా రచన పూర్తయ్యిందని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు నాని కూడా తన కెరీర్‌ను మరింత విస్తరించే దిశగా భారీ ప్రాజెక్టులను సిద్ధం చేసుకుంటున్నాడు. మాస్ కథలతో ప్రేక్షకులను అలరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు. భవిష్యత్తులో అయినా నాని  శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో సినిమా వస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. సినీ అభిమానులు మాత్రం ఈ కలయిక ఎప్పుడో ఒకప్పుడు నిజం కావాలని ఆశిస్తున్నారు.

## 'మార్కో' టీం నుంచి మరో క్రేజీ థ్రిల్లర్

### 'కటాలన్' ఫస్ట్ గ్లింప్స్ విడుదల




**కొచ్చి,** మలయాళ చిత్ర పరిశ్రమలో యాక్షన్ చిత్రాలకు కొత్త గుర్తింపు తీసుకొచ్చిన బృందం నుంచి మరో ఆసక్తికర థ్రిల్లర్ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మలయాళ స్టార్ హీరో ఆంటోనీ వర్గీస్ పెపే ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'కటాలన్'కు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. 'మార్కో' వంటి భారీ యాక్షన్ చిత్రాన్ని అందించిన క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను నిర్మిస్తుండగా, దర్శకుడు పాల్ జార్జ్ ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. విడుదలైన గ్లింప్స్‌లో యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాలో ఆంటోనీ వర్గీస్ పెపే అక్రమంగా ఏనుగు దంతాల రవాణా చేసే స్మగ్లర్ పాత్రలో కనిపించనున్నాడు. అతని పాత్రలో తీవ్రత, రఫ్ అండ్ టఫ్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక ఈ చిత్రంలో టాలీవుడ్ నటుడు సునీల్, 'వేట్టయన్' చిత్రంతో గుర్తింపు పొందిన దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరి పాత్రలు కథలో కీలక మలుపులు తీసుకురానున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, సస్పెన్స్ మేళవింపుతో తెరకెక్కుతున్న ఈ చిత్రం సమ్మర్ కానుకగా మే నెలలో ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలైన ఫస్ట్ గ్లింప్స్‌తోనే 'కటాలన్'పై మంచి అంచనాలు ఏర్పడ్డాయి.

## టీ20 చరిత్రలో బుమ్రానే గొప్ప ఆటగాడు



**ముంబై,** టీ20 క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాడు ఎవరనే ప్రశ్నకు దక్షిణాఫ్రికా దిగ్గజ బ్యాటర్ ఏబీ డివిలియర్స్ ఆసక్తికరమైన సమాధానం ఇచ్చాడు. సాధారణంగా విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్ వంటి దిగ్గజ బ్యాటర్ల పేర్లు వినిపిస్తాయని భావించిన అభిమానులకు భిన్నంగా, భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రానే ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ టీ20 ఆటగాడని ఆయన పేర్కొనడం సంచలనంగా మారింది. ఏ పరిస్థితుల్లోనైనా మ్యాచ్ గెలిపించే సామర్థ్యం బుమ్రాలో ఉందని డివిలియర్స్ ప్రశంసించాడు. కొత్త బంతి, పాత బంతి, లేదా ఉత్కంఠభరితమైన సూపర్ ఓవర్ వంటి క్లిష్ట సమయాల్లో కూడా బుమ్రా తన బౌలింగ్‌తో అద్భుతాలు చేస్తాడని ఆయన అభిప్రాయపడ్డాడు. అయితే తనకు బౌలింగ్ చేయనంత వరకే అతను గొప్ప బౌలర్ అంటూ డివిలియర్స్ తనదైన శైలిలో సరదాగా వ్యాఖ్యానించాడు. బుమ్రా గణాంకాలు కూడా అతని ప్రతిభను స్పష్టంగా చూపిస్తున్నాయి. 2013లో టీ20ల్లో అరంగేట్రం చేసిన అతడు ఇప్పటివరకు 270 మ్యాచ్‌లలో 345 వికెట్లు సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో భారత్ తరఫున 95 మ్యాచ్‌లలో 121 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్లలో ఒకరిగా నిలిచాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు కీలకంగా నిలుస్తూ 145 మ్యాచ్‌లలో 183 వికెట్లు సాధించి, జట్టు చరిత్రలోనే అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా గుర్తింపు పొందాడు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ మాజీ పేసర్ ఆకిబ్ జావేద్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. బుమ్రా బౌలింగ్ శైలిని ఉద్దేశిస్తూ అతడిని ఒక స్పిన్నర్‌తో పోల్చడం అభిమానుల్లో ఆగ్రహం రేకెత్తించింది. ప్రపంచ స్థాయి పేసర్‌ను సాధారణ ఆటగాడితో పోల్చడం సరైంది కాదని సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తానికి, బుమ్రా ప్రతిభపై అంతర్జాతీయ దిగ్గజాల ప్రశంసలు వెల్లువెత్తుతున్న వేళ, అతడు టీ20 క్రికెట్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

## ఇది స్క్వాడ్ కాదు కావ్యపాప ఖతర్నాక్ బ్యాచ్




**హైదరాబాద్,**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు భారీ అంచనాలతో సిద్ధమవుతోంది. మార్చి 28న ప్రారంభమయ్యే ఈ సీజన్‌లో తొలి మ్యాచ్‌లోనే బెంగళూరు జట్టుతో తలపడనున్న హైదరాబాద్, ఈసారి గత వైఫల్యాలను మరచిపోయి బలంగా తిరిగి రావాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత సీజన్‌లో ఆరో స్థానంతో ముగించి ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయిన ఈ జట్టు, ఇప్పుడు కొత్త ఆటగాళ్లతో సమతుల్య కూర్పుతో మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ఈసారి జట్టు కూర్పు ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ వంటి దూకుడైన ఆటగాళ్లు టాప్ ఆర్డర్‌లో బలమైన ఆరంభం ఇవ్వగల సామర్థ్యం కలవారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ ఇటీవల అద్భుత ఫామ్‌లో ఉండటం జట్టుకు పెద్ద ప్లస్‌గా మారింది. మధ్య వరుసలో హెన్రిచ్ క్లాసెన్, కమిందు మెండిస్, లియామ్ లివింగ్‌స్టోన్ వంటి ఆటగాళ్లు జట్టుకు బలాన్ని చేకూరుస్తున్నారు. అభిషేక్ శర్మ నుంచి లియామ్ లివింగ్‌స్టోన్ వరకు అనేక ఆల్‌రౌండర్లు జట్టులో ఉండటం ప్రత్యేకతగా నిలుస్తోంది. వీరు బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ కీలక పాత్ర పోషించగలరు. ఈ సమతుల్యత జట్టుకు అనుకూల పరిస్థితులను సృష్టించడంలో సహాయపడుతుంది. అలాగే హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కట్, శివమ్ మావి వంటి బౌలర్లు బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేస్తున్నారు. అయితే బౌలింగ్‌లో స్థిరత్వం సాధించడం జట్టుకు కీలకంగా మారింది. అన్ని విభాగాల్లో సమన్వయం సాధిస్తే ఈసారి హైదరాబాద్ జట్టు ప్లేఆఫ్స్ రేసులో బలంగా నిలిచే అవకాశముంది. శక్తివంతమైన బ్యాటింగ్, అనుభవం కలిగిన ఆటగాళ్లతో ఈ జట్టు ఈసారి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వడం ఖాయం అని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com